డీఈ దానయ్యకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే

కడ్తాలలో డీఈ దానయ్యకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

భూత్పూర్, జూలై 10 : వనపర్తి ఆర్‌అండ్‌బీ డీఈ దానయ్య మంగళవారం రాత్రి రంగారెడ్డి జిల్లా కడ్తాలలో మృతి చెందడంపై మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. బుధవారం ఆల కడ్తాలకు వెళ్లి బాధితుని కుటుంబాన్ని పరామర్శించారు. వృత్తిపరంగా ఎన్నోసేవల్ని అందించారన్నారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), జూలై 10 : చిన్నచింతకుంట మండలం బండర్‌పల్లికి చెందిన వాకిటి కురుమన్న అనారోగ్య కారణంగా బుధవారం మృతి చెందాడు. విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని కురుమన్న పార్థివదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే పర్దీపూర్‌కు చెందిన ప్యాట శ్రీను రోడ్డు ప్రమాదంలో గాయపడి మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు.

విషయం తెలిసిన ఆల దవాఖానకు వెళ్లి బాధితుని పరామర్శించి ఆరోగ్య విషయం తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కోట రాము, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మత్స్య రైతుల దినోత్సవం పోస్టర్ విడుదల

పోస్టర్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్

పాలమూరు, జూలై 10: స్థానిక ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ మత్స్య రైతుల దినోత్సవం సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపాల్ డా.విజయ్‌కుమార్ గోడపత్రికను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేపల ప్రొటీన్ కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంలో, ఉపాధి అవకాశాలు సృష్టించడంలో, దేశ ఆహార భద్రతకు దోహదం చేయడంలో చేపలరైతులు పోషించే ముఖ్యమైన పాత్ర గుర్తించడానికి జాతీయ చేపల దినోత్సవం ఒక ముఖ్యమైన వేదికగా పనిచేస్తుందన్నారు. కొన్నేళ్లుగా శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక జోక్యాలతో మత్స్యరంగం గణనీయ పురోగతి సాధించిందన్నారు.

కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి స్వాతి ప్రసంగించారు. కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ లావణ్య, అధ్యాపకులు, డా.మధుసుదన్, డా. శివప్రసాద్, వెంకటరమణమూర్తి, ఆసియాబేగం, నాగలింగం, డా.నరేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఆదుకున్న కేసీఆర్ సర్కారు

- ఉచిత విద్యుత్ పథకానికి నిధులు విడుదల చేయాలి

మక్తల్, జూలై 10: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో లాండ్రీ షాపులకు ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని రజక సంఘం నాయకులు ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి నివాసగృహంలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ రజక, నాయీ బ్రాహ్మణ సంక్షేమం కోసం ప్రతిఒక్క షాపు వారికి 250యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేసి రూ.140 కోట్ల బకాయిలను విడుదల చేసి రజక నాయీ బ్రాహ్మణులను ఆదుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఉచిత విద్యుత్ ఇవ్వకుండా నెలనెలా బిల్లులు కట్టాలని విద్యుత్ అధికారులు ఒత్తిడి చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం లాండ్రీ షాపులకు నాయీ బ్రాహ్మణులకు 250 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేసి ఎనిమిది నెలల బకాయిలను సైతం ఏ ఒక్కరినీ అడగకుండా ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని రద్దు చేస్తే ఆందోళన కార్యక్రమానికి దిగేందుకు వెనుకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మలబార్ గోల్డ్ డైమండ్ జ్యువెలరీ ప్రదర్శన

వజ్రాభరణాల ప్రదర్శన

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 10: మహబూబ్‌నగర్‌లోని మలబార్ గోల్డ్ డైమండ్ షోరూంలో బుధవారం వజ్రాభరణాల ప్రదర్శన ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని గైనకాలజిస్ట్ డాక్టర్ చేతన్, షోరూం హెడ్ అఖిల్‌నజీమ్, వినియోగదారులతో కలిసి ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వినియోగదారులు స్టోర్‌ను సందర్శించి, వజ్రాభరణాల నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయాలని సూచించారు. ఈనెల10 నుంచి 15వతేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందని, ప్రతి కొనుగోలుపై తగ్గింపు ఇస్తున్నామని మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు.

జేపీఎన్‌సీఈలో పైథాన్ ఆవశ్యకతపై శిక్షణ

పాలమూరు, జూలై 10: స్థానిక జయప్రకాశ్‌నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో బుధవారం పైథాన్ యొక్క ఆవశ్యకతపై 3రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్ శిక్షకులు భానుప్రదీప్ మాట్లాడుతూ సీఎస్ఈ విద్యార్థులకు పైథాన్ ప్రోగ్రామింగ్ మెషిన్ లెర్నింగ్ టెస్టింగ్ విభాగంలో ఉపయోగించడంతో పాటు నూతన సాఫ్ట్‌వేర్ రూపొందించడంలో ఉపయోగిస్తారని తెలిపారు. విద్యార్థులు ఈ శిక్షణలో భాగంగా ల్యాబ్‌లలో ప్రోగ్రామ్స్ తయారీ, పైథాన్ అప్లికేషన్స్‌ను స్వయంగా రూపొందించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.సుజీవన్‌కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి డా.గురురాఘవేంద్ర రెడ్డి, కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రిన్సిపాల్

బహిరంగ ప్రకటన

తేదీ:10-07-2024

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు శ్రీమతి పున్న పారిజాత తండ్రి పున్న బాలస్వామి (భర్త గోస్కె నాగరాజు). నివాసము ఇం.నం.12-80, సుభాష్ వీధి, కావేరమ్మపేట గ్రామం, జడ్చర్ల మండలం, మహబూబ్‌నగర్ జిల్లా గారి తరపున జారీ చేయు బహిరంగ ప్రకటన ఏమనగా, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మరియు గ్రామ శివారులోగల భూమి సర్వే నెం.281/అ లో గల ప్లాటు నెంబరు 50, విస్తీర్ణం 133.33 చ.గజములు గల ప్లాటుకు సంబంధించిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెంబర్స్ 11424/2021, 5121/2021, 7312/2019 మరియు 1018/2000 గలదు. ఇప్పుడు నా క్లయింటు వద్ద లభ్యముగా లేవు. ఇట్టి విషయమై తగు చర్య నిమిత్తం స్టంబంధిత పోలీసు వారికి దరఖాస్తు ఇవ్వగా Missing Certificate ఇచ్చియున్నారు. కావున తెలియజేయునది ఏమనగా ఇట్టి ప్లాట్లపై ఎవరికైన వ్యక్తులు, సంస్థలు, ఏజెన్సీలు, తదితరములు ఏమైనా అభ్యంతరాలు, హక్కులు, క్లెయిములు ఉన్నయెడల క్రింది చిరునామాలో (7) రోజులలో తమ అభ్యంతరాలను, హక్కులను తగు దస్తావేజులతో సంప్రదించగలరు. మరియు ఎవరికైన అట్టి దస్తావేజు దొరికినచో క్రింది చిరునామాలో ఇవ్వగలరు. భవిష్యత్తులో వచ్చు ఏదేని న్యాయ పరమైన చిక్కులు, వివాదాలు నివారించుటకు ఇట్టి బహిరంగ ప్రకటన జారీ చేయునైనది.

పై కనబరచిన ప్లాటు యొక్క హద్దులు :
తూర్పు: 30-00" ఫీట్ల రోడ్డు. **పడమర:** ప్లాటు నంబరు 51/A. **ఉత్తరము:** ప్లాటు నంబరు 49. **దక్షిణము :** ప్లాటు నంబరు 51.

శంకర్ నారాయణ ఝవార్, MBA, LL.B., న్యాయవాది.
చంద్రా గార్డెన్ కమాన్ దగ్గర, బాదేపల్లి, జడ్చర్ల,
మహబూబ్‌నగర్ జిల్లా . ఫోన్ నెం.9849573451

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల డిమాండ్

జడ్చర్లలో.. కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు



దేవరకద్ర : తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఊట్కూర్, జూలై10: ఆశ కార్యకర్తల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ నారాయణ అన్నారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు తాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం ఆశ కార్యకర్తలకు కనీసవేతనం రూ.26,000 అమలుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తాసీల్దార్ మమతకు అందజేశారు. కార్యక్రమంలో నారాయణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలను అమలుచేయాలి

దేవరకద్ర, జూలై 10 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7నెలలు అవుతున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలంచెందిందని సీఐటీయూ జిల్లాఉపాధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తు బుధవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తాసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందచేశారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

బాలానగర్, జూలై 10: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం స్థానిక తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సీఐటీయూ నాయకుడు దీప్లానాయక్ అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తాసీల్దార్ శ్రీనివాసరెడ్డికి అందజేశారు.

కార్మిక కోడ్‌లను రద్దు చేయాలి

మక్తల్, జూలై 10: కార్మికులను కట్టు బానిసత్వంలోకి నెట్టే నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ బుధవారం మక్తల్ డిప్యూటీ తాసీల్దార్‌కు అంగన్‌వాడీ ఆశ కార్యకర్తలతో కలిసి సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ గోవింద రాజు మంజుల, విజయలక్ష్మి ఉన్నారు.

మాగనూర్‌లో..

మాగనూర్, జూలై 10: స్థానిక తాసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించి, తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోకన్వీనర్ ఆంజనేయులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సూర్యప్రకాశ్, శివకుమారి ఉన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

నారాయణపేట, జూలై 10 : కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దస్తప్ప డిమాండ్ చేశారు. బుధవారం అఖిల భారత కార్మికదినం సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్(ఆశ) యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్‌పార్క్ వద్ద ధర్నా చేశారు. అనంతరం ఉపతాసీల్దార్ నారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాలమణి, పాల్గొన్నారు. మధ్యాహ్న భోజనకార్మికులు ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

జడ్చర్లలో..

జడ్చర్ల, జూలై 10 : కార్మికుల డిమాండ్స్‌డే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం జడ్చర్లలోని తాసీల్దార్ కార్యాయం దగ్గర ధర్నా నిర్వహించారు. అనంతరం తాసీల్దార్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి తెలుగు సత్యయ్య, వెంకటేశ్ సరోజ ఉన్నారు.

మరికల్‌లో..

మరికల్, జూలై 10: మరికల్‌లోని తాసీల్దార్ కార్యాలయం వద్ద ఆశా, అంగన్‌వాడీ టీచర్లు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు బాలప్ప మాట్లాడారు. అనంతరం తాసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అనురాధ, కవిత, మహేశ్వరి, శశికళ,ఆశా,సులోచన ఉన్నారు.

ధన్వాడలో..

ధన్వాడ, జూలై 10: ధన్వాడలోని తాసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణయ్య, చంద్రకళ, సుమిత్ర, అనురాధ, అంజలి, యశోధ, మాసనమ్మ, మంగమ్మ, ఉదయభాను, బాలకృష్ణ, రమేశ్ పాల్గొన్నారు.

బాలానగర్‌లో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మరికల్‌లో.. వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

మక్తల్‌లో వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పేటలో ఉపతాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మాగనూరులో...

రేవంత్‌రెడ్డికి నిరుద్యోగుల ఉసురు తగులుతుంది

పీయూ బీఆర్ఎస్వీ కన్వీనర్ భరత్‌బాబు

మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ కన్వీనర్ భరత్‌బాబు

పాలమూరు, జూలై 10: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నిరుద్యోగుల ఉసురు తగులుతుందని పీయూ బీఆర్ఎస్వీ కన్వీనర్ భరత్‌బాబు అన్నారు. బుధవారం పీయూలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా సమీక్ష సమావేశానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ కార్యక్రమంలో అయిపోయిన తర్వాత ఏఎస్ఎస్ఎన్ గార్డెన్‌లో పార్టీ కార్యక్రమంలో మాట్లాడుతూ నిరుద్యోగుల పక్షాన మడ్డతుగా మాట్లాడే వారిని తలకుమాసిన వాళ్లు అని మాట్లాడడం దౌర్భాగ్యమన్నారు. వారి డిమాండ్లను సామరస్యంగా అడుగుతున్న నిరుద్యోగులను కించపరచడం సరికాదన్నారు. అదేవిధంగా ప్రజాస్వామ్యం లో నిరుద్యోగుల పక్షాన మద్దతుగా నిలిచే వారిని ఇలా మాట్లాడడం మంచి పద్ధతి కాదని, నిరుద్యోగుల ఓట్లతో గెలిచిన ఆయన ఇప్పటికైనా మేల్కొని ఎన్నికల్లో నిరుద్యోగుల కు బాండ్ పేపర్ మీద ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. ఎన్నికలకు ముందు 1:100 ప్రకారం ఇవ్వాలన్న మీరు, అధికారంలోకి వచ్చాక 1:50 ప్రకారం ఇచ్చారని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట అధికార పక్షంలో ఉన్నప్పుడు మరో మాట మాట్లాడడం వారికే సాధ్యమన్నారు.కార్యక్రమంలో తిరుమల్‌నాయుడు, రమేశ్, పూర్ణచందర్‌రావు, రేణు, నరేశ్, సమీర్ పాల్గొన్నారు.

ఉత్తమ హెల్త్‌అసిస్టెంట్ అవార్డుకు ఎంపిక

నవాబ్‌పేట, జూలై10: నవాబ్‌పేట ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ శరభలింగం జిల్లాస్థాయి ఉత్తమ హెల్త్ అసిస్టెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. మండలంలోని ప్రజలకు కుటుంబ నియంత్రణ, శాశ్వత పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, అంటువ్యాధులు, నివారణ మార్గాలపై ప్రజలను చైతన్యం చేసినందుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మెనూప్రకారం భోజనం అందించాలి

నారాయణపేట, జూలై 10: వసతిగృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి కృష్ణమాచారి ఆదేశించారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని బీసీ బాలికల మరియు బీసీ బాలుర కళాశాల వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల పరిసరాలు, రికార్డు బుక్కులు, గదులను పరిశీలించారు.

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

ఊట్కూర్, జూలై 10: మొహర్రం వేడుకలను భక్తులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పేట డీఎస్పీ లింగయ్య చెప్పారు. బుధవారం ఊట్కూర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఆయన హసన్, హుస్సేన్ పీర్ల చావడిని సందర్శించారు. ఉత్సవ నిర్వాహకులతో మాట్లాడుతూ. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌వో వెంకట్ పాల్గొన్నారు.

తగ్గుతున్న ఉల్లి ధరలు

దేవరకద్ర, జూలై 10 : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి ధరలు స్వల్పంగా తగ్గుతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో సాగుచేసిన ఉల్లి రైతులు విక్రయించేందుకు బుధవారం మార్కెట్‌కు తీసుకొవచ్చారు. దాదాపు 45క్వింటాళ్ల ఉల్లి విక్రయానికి వచ్చింది. క్వింటాకు గరిష్ఠంగా రూ.3,200 ధర పలికింది. గరిష్ఠంగా కింట్వాకు రూ. 2,700 వరకు ధర వచ్చింది.

సంస్కారం అలవర్చుకోవాలి

బాలానగర్, జూలై 10: చదువుతో పాటు విద్యార్థులు సంస్కారాన్ని అలవర్చుకోవాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకురాలు ఉషారాణి అన్నారు. బుధవారం ప్రభుత్వ బాలుర, బాలికోన్నత పాఠశాలను పరిశీలించారు.

మత్స్యకార్మిక బీమా అమలు చేయాలి

నారాయణపేట టౌన్, జూలై 10 : రైతుబీమా మాదిరిగా మత్స్య కార్మికులకు మత్స్యకార్మిక బీమాను అమలు చేయాలని మత్స్యసహకార సంఘం జిల్లాఅధ్యక్షుడు కాంత్‌కుమార్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్ అన్నారు. బుధవారం మత్స్యశాఖ కార్యాలయంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

కోనేరు పూడ్చివేత కేసులో..నిందితుడు అరెస్ట్

జడ్చర్ల, జూలై 10: బాదేపల్లి పెద్దగుట్టపై రంగనాయస్వామి ఆలయ ఆవరణలోని కోనేరును పూడ్చివేసిన ఘటనలో నిందితుడు రవితేజగౌడ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి

ధన్వాడ, జూలై10: ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం తెలంగాణలో అమలు చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు గున్ముక్ల మాజీ ఎంపీటీసీ గౌని శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మట్లాడుతూ ఇసుకటెండర్ల ద్వారా పంపిణీ చేయడంవల్ల కాంట్రాక్టర్లు లాభపడుతున్నారన్నారు.

ఘనంగా జాతీయ విద్యార్థి దినోత్సవం

పాలమూరు, జూలై 10: జిల్లా కేంద్రంలో ఏబీవీపీ 76వ విద్యార్థి దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మెట్టుగడ్డ కూడలి నుంచి కొత్తబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రూన్సి మాట్లాడుతూ ఏబీవీపీ సభ్యత్వాలు ఇప్పటికే 54లక్షలకు పైగా ఉన్నాయని, దేశవ్యాప్తంగా విస్తరించిందని చెప్పారు. విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులతో ర్యాలీగా వస్తున్న ఏబీవీపీ నాయకులు

బైక్‌ను ఢీకొట్టిన బొలేరో.. వ్యక్తి మృతి

బూరెడ్డిపల్లి వద్ద హైవేపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

జడ్చర్ల, జూలై 10: బొలేరో మోటర్‌సైకిల్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన 44వ జాతీయ రహదారిపై బూరెడ్డిపల్లి స్టేజీవద్ద బుధవారం సాయంత్రం చోటుచేసుకున్నది. భూత్పూర్ వైపు నుంచి మోటర్‌సైకిల్‌పై వస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లికి చెందిన శ్రీను బూరెడ్డిపల్లి స్టేజీ దగ్గర 44వ జాతీయ రహదారిని దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న బొలెరో ఢీకొట్టింది. కింద పడడంతో శ్రీను కడుపుభాగంపై నుంచి వాహన వెళ్లడంతో అతని పేగులు పూర్తిగా బయట పడ్డాయి. తీవ్రంగా గాయపడిన అత న్ని స్థానికులు 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ప్రమాద విషయం తెలియడంతో గ్రామస్తులు, ప్రయాణికులు హైవేపై రాస్తారోకో చేశారు. గ్రామ స్టేజీ వద్ద ఫ్లైవర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని సర్దిచెప్పడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.

నిబంధనల మేరకే గోదాం నిర్మాణం

జడ్చర్ల, జూలై 10: బాదేపల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గోదాం నాబార్డు వారి నిబంధనల మేరకే నిర్మించి బాదేపల్లి పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్ తెలిపారు. బుధవారం జడ్చర్లలోని బాదేపల్లి పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ నాగసాల శివారులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నాబార్డు రుణంతో గోదామును నిర్మించినట్లు తెలిపారు. ఈ పనులకు ఎంబీ రికార్డు ప్రకారమే బిల్లులు మంజూరయ్యాయని, నాబార్డు వారు ఈ రుణాన్ని అడ్వాన్సుగా ఇవ్వలేదన్నారు. 2022-23 సంవత్సరంలో బాదేపల్లి పీఏసీసీఎస్ ఆధ్వర్యంలో ఎరువుల అమ్మకాలకు సంబంధించి రూ.3లక్షల 37వేల అక్రమాలు జరిగాయన్నారు. అధికారులు విచారణ చేపట్టారని, ఇందుకు సంబంధించి సీఈవో యాదగిరికి నోటీసులు జారీ చేశారన్నారు. సహకార సంఘం పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగికి ఎరువుల అమ్మకాలు నిర్వహించేలా నిర్ణయం తీసుకున్నట్లుగా సహకార సంఘం సభ్యులు తీర్మానం చేసినట్లు తప్పుడు పత్రాలు సృష్టించాడని సుదర్శన్‌గౌడ్ ఆరోపించారు. వీటన్నింటిపై మంగళవారం బాదేపల్లి సహకార సంఘం సమావేశాన్ని నిర్వహించామని, పీఏసీసీఎస్ సీఈవో యాదగిరిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ తీర్మానం చేశామని తెలిపారు.

సమావేశంలో పీఏసీసీఎస్ వైస్‌చైర్మన్ సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టీచర్‌గా మారిన కలెక్టర్

- జాజాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో పాఠం బోధన

జాజాపూర్ ఉన్నత పాఠశాలలో బోధిస్తున్న కలెక్టర్

నారాయణపేటరూరల్, జూలై 10: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని పేట కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. బుధవారం పేట మండలంలోని జాజాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత,ప్రాథమిక పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 9వ తరగతిలో ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులకు మ్యాథ్స్ బోధించారు. కార్యక్రమంలో డీఈవో అబ్దుల్‌గని, ఎస్‌వో శ్రీనివాస్, హెచ్.ఎంలు భారతి, నాగభూషణంగౌడ్ గ్రామ ప్రత్యేకాధికారి నర్సింగ్‌రావు, కార్యదర్శి సుమలత పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట టౌన్, జూలై 10: ధరణి సమస్యలు వారంలోపూ పరిష్కరించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పరిసరాలు, రికార్డు రూమ్, ఏవో రూమ్ ఇతర గదులను పరిశీలించారు. ప్రతిరోజూ ఎన్ని ఫైల్‌లను పరిష్కరిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుమోహన్, తాసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం గారూ మా వేతనాలెక్కడ?

- గురుకుల టీచర్లకు అందని వేతనాలు

మహబూబ్‌నగర్, జూలై 10: రాష్ట్రంలో గురుకుల టీచర్లకు వేతనాలు అందటంలేదని వాపోయారు. 10వ తేదీ వచ్చినా నేటికీ జీతాలు రాలేదని, మరోపక్క సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేదీన వేతనాలు వేస్తున్నామని తప్పుడు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. జీతాలు కొందరికేనా? గురుకులాల్లో పనిచేస్తున్న మాకు ఎందుకు వేతనాలు సరిగావేయడం లేదని ప్రశ్నించారు. వేంటనే అందించాలని కోరారు.

మక్తల్‌కు సివిల్, క్రిమినల్ కోర్టు మంజూరు

మక్తల్, జూలై 10 : మక్తల్ నియోజకవర్గానికి సివిల్, క్రిమినల్ కోర్టు మంజూరైంది. వీటికి సంబంధించిన ఉత్తర్వులను బుధవారం హైదరాబాద్‌లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి లా కార్యదర్శి చేతుల మీదుగా అందుక